

వనపర్తి జంతు జనన నియంత్రణ కేంద్రంలో కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు

# కుక్కలకు ఆపరేషన్లు షురూ..

- వనపర్తి జిల్లాలో 15 వేలకు పైగా..
- ప్రతిరోజూ పది వరకు సర్జరీలు

వనపర్తి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : పసిపిల్లలపై కుక్కల దాడులు తీవ్రమైన నేపథ్యంలో ఎట్టకేలకు వాటి సంతతిని తగ్గించేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. చిన్నారులతోపాటు మహిళలు, వృద్ధులపై కుక్కల దాడులు పెరగడం వల్ల వీటి నివారణకు శ్రీకారం చుట్టారు. ఈ ఘటనలపై కోర్టులు సైతం ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడంతో చలనం వచ్చింది. ఈ మేరకు వనపర్తి జిల్లాలో గురువారం సాయంత్రం కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలకు మేరకు మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో కుక్కల శస్త్రచికిత్సలు ఎట్టకేలకు మొదలయ్యాయి. మున్సిపల్ పరిధిలోని నాగవరం శివారులోని ఊరగుట్ట సమీపంలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. యానిమల్ వెల్ఫేర్ కేర్ సెంటర్ ఏజెన్సీతో ఒప్పందం మేరకు ఈ కార్యక్రమాన్ని నడిపిస్తున్నారు. కుక్కల సంతతిని తగ్గించడం కోసం సురక్షితమైన పద్ధతిలో సర్జరీలు చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి కుక్కలను సేకరించి సంతాన ఉత్పత్తి జరగకుండా ఏజెన్సీ నిర్వాహకులు చికిత్సలకు శ్రీకారం చుట్టారు. శస్త్రచికిత్స అనంతరం కుక్కలను వారం రోజులపాటు కేంద్రంలోనే ఉంచుకొని ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం యథాస్థానంలో కుక్కలను వదిలి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 15వేలకు పైగా కుక్కలున్నట్లు 2019 జంతుగణన ద్వారా పశుసంవర్ధకశాఖలో నమోదైంది. ఇదిలా ఉంటే, గతంలో కుక్కలకు మందులు పెట్టి జీపీల వారీగా నివారణ చర్యలు తీసుకునే పరిస్థితి ఉండింది. కొందరు జంతు ప్రేమికులు కోర్టులకు ఎక్కడం ద్వారా కుక్కలను చంపడం నిలిచిపోయింది. వీటిపై కొన్ని పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదైన సంగతి తెలిసిందే.





కర్నూల్ బ్యాంకుల్లోని రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు (ఫైల్)

- కర్నూల్ బ్యాంకుల్లో లోన్ తీసుకున్న అలంపూర్ నియోజకవర్గ రైతుల నిలదీత
- రెండు విడుతల్లో వర్తించక ఆందోళన
- కేసీఆర్ ప్రభుత్వం మాఫీ చేసిందని స్పష్టం
- కాంగ్రెస్ హయాంలో వర్తించని పథకం
- సర్కార్ చెప్పేదొకటి.. చేసేదొకటంటూ ఆగ్రహం

# రుణమాఫీ మాకేదీ?

గద్వాల, ఆగస్టు 8 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు.. ప్రస్తుతం అమలు చేస్తున్న హామీలకు పొంతన లేదని.. దీంతో ప్రజలతోపాటు రైతులూ అవస్థలు పడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు ఏపీలోని కర్నూల్‌తో విడదీయరాని సంబంధాలు ఉన్నాయి. వ్యాపార లావాదేవీల కోసం అలంపూర్ నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఈ నగరానికే వెళ్తుంటారు. అదే క్రమంలో మన రైతులు అక్కడున్న బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అలంపూర్‌కు చెందిన వివిధ గ్రామాల ప్రజలు కర్నూల్‌లోని కెనరా, యాక్సిస్‌తోపాటు పలు బ్యాంకుల్లో వ్యవసాయ అవసరాల కోసం రుణాలు తీసుకున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీలో వీరికి రుణమాఫీ వర్తించలేదు. దీనికి నిరసనగా తమకూ రుణమాఫీ వర్తింపజేయాలని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గత సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

***30 ఏండ్లుగా కర్నూల్ బ్యాంకుల్లో..***

30 ఏండ్లుగా అలంపూర్ నియోజకవర్గంలోని పల్లెపాడ్, చందూర్, ఇటిక్యాల, జల్లాపురం, పుల్లూరు, బోరవెల్లి, జింకలపల్లితో ఇతర గ్రామాలు ఏపీలోని కర్నూలకు అతి సమీపంలోనే ఉంటాయి. దీంతో ఈ గ్రామాలకు చెందిన 350 నుంచి 400 మంది రైతులు కర్నూల్ బ్యాంకుల్లో రుణాలు పొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పుడు వీరందరికీ వర్తింపజేశారు. దీంతోపాటు రైతుబంధు కూడా ఆయా బ్యాంకుల్లో జమయ్యేవి. కానీ, కర్నూల్ బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు రుణమాఫీ గురించి మేనిఫెస్టోలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న పంట రుణాలు చెల్లవని పొందుపర్చలేదని, మేమంతా తెలంగాణ రైతులమే.. అయినా మాకు రుణమాఫీ ఎందుకు కావడం లేదని పలు గ్రామాల కర్షకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మేము తెలంగాణ రైతులమే కాబట్టి మాకు రుణమాఫీ చేయాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా కర్నూల్‌లో రుణాలు తీసుకున్న తెలంగాణ రైతులకు సంబంధించి వ్యవసాయశాఖ కమిషనర్‌కు లేఖ పంపమని కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించినట్లు తెలిసింది. అయితే వాస్తవంగా ఏ ఏరియా పరిధిలో ఉన్న వారికి అక్కడే వ్యవసాయ రుణాలు ఇవ్వాలి గానీ.. గతంలో బ్యాంకులు, సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకంగా రుణాలు ఇచ్చారు. ఒక రాష్ట్రంలో రుణాలు తీసుకున్న వారికి ఇంకో రాష్ట్రంలో రుణమాఫీ ఎలా అవుతుందని అధికారులతోపాటు బ్యాంకర్స్ చెప్పడం కొసమెరుపు.

**ప్రభుత్వం జీవో విడుదల చేస్తే ఇస్తాం**

కర్నూల్ కెనరా, యాక్సిస్ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ చేయాలని ప్రభుత్వం జీవో ఇస్తే చేస్తాం.. నిబంధనల ప్రకారం విచారణ చేసి వారికి కూడా రుణమాఫీ అయ్యేలా చూస్తాం. వారి నిర్ణయం మీదే మాఫీ ఆధారపడి ఉంది. *- అయ్యపురెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్*

**మాకు రుణమాఫీ కాలేదు**



నాకు ఎడెకరాల పొలం ఉన్నది. కర్నూల్ కెనరా బ్యాంక్‌లో రూ.4 లక్షల అప్పు తీసుకున్నాను. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ జరిగింది. కేసీఆర్ మొదటిసారి మాఫీ చేసినప్పుడు కూడా అయ్యింది. ఆ తర్వాత రెండోసారి ఎన్నికల కోడ్ నేపథ్యంలో కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మాఫీ కాలేదు. తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి మాకు రుణమాఫీ వర్తింపజేయాలి. మేము తెలంగాణ రైతులం.. మా పొలాలు ఇక్కడే ఉన్నాయి. *- సత్యారెడ్డి, పల్లెపాడ్, మానవపాడు*

**సర్కారు సానుకూలంగా స్పందించాలి**



నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. కర్నూల్ కెనరా బ్యాంక్‌లో రూ.లక్షా 60 వేలు అప్పు తీసుకున్నాను. గతంలో మాకు రుణమాఫీ జరిగింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఒకసారి రుణమాఫీ అయ్యింది. తర్వాత కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కాలేదు. మా పంట పొలాలు తెలంగాణలోనే ఉన్నాయి. మేమూ తెలంగాణలోనే ఉన్నాం.. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మాకు రుణమాఫీ వర్తింపజేయాలి. *- నాగేంద్ర, పల్లెపాడ్, మానవపాడు*



రాజోళిలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# పేదలకు కల్యాణలక్ష్మి అండ

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్/రాజోళి/వడ్డేపల్లి, ఆగస్టు 8 : తెలంగాణలోని పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అండగా నిలుస్తున్నాయని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం అలంపూర్ మండలకేంద్రంలో గురువారం 54 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే రాజోళి రైతువేదికలో 93 మందికి కల్యాణలక్ష్మి, ఐదుగురికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. శాంతినగర్‌లో తాసీల్దార్ కార్యాలయంలో 60 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డ పుడితే భారం అనుకునే కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షానూటపదహారు అందించి అండగా నిలిచి ఆదుకున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, వైస్‌చైర్మన్ సుజాత, తాసీల్దార్లు మంజుల, హరికృష్ణ, జోషి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజు, బాబి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.





9, 53వ నెంబర్ దుకాణాలకు సీల్ వేస్తున్న పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

# రెండు రేషన్ షాపుల సీజ్

- మహబూబ్‌నగర్ పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు
- హాట్‌టాపిక్‌గా మారిన అధికారుల తీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 8 : చౌకధర దుకాణాలపై పౌర సరఫరాలశాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఓ సంఘం నాయకుడి దుకాణానికి అధికారులు సీల్ వేయడం పాలమూరులో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంపై అధికారులు సమగ్ర వివరాలు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దాడులు చేసి తనిఖీలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సైతం 'మాకేం తెలియదు.. వచ్చాం.. వెళ్లాం' అంతా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే.. అంటూ దాటవేత ధోరణిలో వ్యవహరించారు. ఉమ్మడి పాలమూరులో చౌకధర దుకాణాలకు సరఫరా చే స్తున్న బియ్యం పలుచోట్ల అక్రమరవాణా చేస్తూ ప ట్టుబడుతుండడం విశేషం.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలో కొందరు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఒక వైపు అధికారులు చౌక దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా.. మరోవైపు డీలర్లు దుకాణాలు మూసి అజ్ఞాతంలోకి జారుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ప్రత్యేక బృందాలుగా చౌక దుకాణాలను తనిఖీ చేశాయి. తనిఖీల సమాచారం తెలుసుకున్న డీలర్లు కొందరు సెల్‌ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ చేసుకున్నారు. కొందరు అందుబాటులోకి రాగా మరికొందరు ఎంతసేపటికీ అందుబాటులోకి రాలేదు. డీలర్లు, సిబ్బంది పిలిచినా రాకపోవటంతో అధికారులు చేసేదేమీ లేక దుకాణాలు సీల్ వేసి వెనుదిరిగారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని చౌకధర దుకాణం నెంబర్లు 53, 9కి అధికారులు సీల్ వేశారు. ఈ విషయంపై మహబూబ్‌నగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా.. దుకాణాల తనిఖీ సమయంలో డీలర్లు సకాలంలో రాకపోవడంతో సీల్ వేశామని తెలిపా రు. నిర్దేశిత సమయంలోనే తాము వెళ్లామని, అధికారులు వచ్చిన సమయంలో లేకపోవడం, పిలిచినా రాకపోవడంతోనే డిసిప్లినరీ యాక్షన్ తీసుకున్నామన్నారు. ఈ నెల 9న మరోసారి సందర్శించి సమగ్ర వివరాలు, దస్త్రాలు పరిశీలిస్తామని పేర్కొన్నారు.

# ప్రకృతితో మమేకం

- అనాదిగా కొండకోనలు, చెట్లు, గుట్టలే ఆవాసాలు
- హక్కుల సాధనకు ఉద్యమిస్తున్న మూలవాసులు
- కేసీఆర్ సర్కారు హయాంలో మెరుగుపడిన సౌకర్యాలు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

అచ్చంపేట, ఆగస్టు 8 : కొండకోనలను ఆవాసంగా చేసుకొని ప్రకృతి మధ్య స్వేచ్ఛగా జీవనం గడుపుతున్న ఆదివాసీల జీవనశైలి స్వరాష్ట్రంలో క్రమంగా మారుతున్నది. అనాదిగా అడవితల్లినే నమ్ముకొని ప్రకృతిలో లభించే అటవీ సంపాదనపై ఆధారపడి జీవిస్తున్నారు. కొండలు, గుట్టలు, బొడ్డు గుడిసెలు, గుంపుచెట్లను నివాస ప్రాంతాలుగా చేసుకొని తరతరాలుగా వాటిపై ఆధారపడి నివసిస్తున్న మూలవాసులు. సమైక్య రాష్ట్రంలో అన్ని వర్గాల మాదిరిగానే ఆదివాసీలు కూడా నష్టపోయారు. అప్పటి ప్రభుత్వాలు, పాలకులు పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. వారికి జీవన సదుపాయాలు, కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో దుర్భర జీవితాన్ని గడిపారు. వైద్యం అందక ప్రాణాలు వదిలారు. దీంతో క్రమంగా సమాజంలో అన్నివర్గాల జనాభా పెరుగుతుంటే చెంచుల జనాభా తగ్గుకుంటూ వచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో సున్నిపెంటలోని ఐటీడీఏను తెలంగాణ ప్రాంతంలోని చెంచులకు అందుబాటులో ఉండేందుకు అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఐటీడీఏ ఏర్పాటు చేసి వారికి కావాల్సిన సౌకర్యాలు ప్రభుత్వం సమకూరుస్తోంది. జీవనోపాధి, రవాణా వ్యవస్థ మెరుగుపర్చడం, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే మహాశివరాత్రి సందర్భంగా నల్లమల దట్టమైన అటవీప్రాంతంలో భౌరాపూర్ ఆదివాసీల జాతరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి ప్రతి ఏడాది నిర్వహిస్తోంది. చెంచులకు కావాల్సిన ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్యంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా అన్ని వర్గాల కన్నా ఆదివాసీ చెంచుల సంక్షేమం, అభివృద్ధిపై ఇప్పటి ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అనాదిగా చెంచు పెంటలను పీడిస్తున్న తాగునీటి సమస్యను చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంటింటికీ నల్లాల ద్వారా నీళ్లు అందించేందుకు గత ప్రభుత్వం రూ.6 కోట్లు ఖర్చుపెట్టింది. అన్ని పెంటలకు సోలార్ ద్వారా సింటెక్స్ ట్యాంకులు పెట్టి బోర్లు ద్వారా ఇంటింటికీ పైపులైనన్ వేసి తాగునీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీటి సమస్య పెంటలను పీడిస్తోంది.





ఆడుకుంటున్న చిన్నారులు, చెంచుపెంటకు ఆటోలో వెళ్తున్న చెంచులు (ఫైల్)

***ఆదివాసీల జీవన విధానం..***

నల్లమల అటవీప్రాంతంలో ఆదివాసీలు పొట్టిగా, సన్నగా, నల్లగా, ఉంగరాల జట్టు కలిగి ఉంటారు. ప్రతి కుటుంబం వంశపారపర్యంగా ఒక భూభాగానికి అధిపతులుగా ఉండి జీవిస్తారు. దట్టమైన అటవీప్రాంతంలో జీవించే చెంచులకు మాత్రం సంపాదనపై ఆసక్తి ఉండదు. ఏరోజుకారోజు పూట గడిపేందుకు ఆసక్తి చూపుతారు. అటవీ ఉత్పత్తులు సేకరించి జీసీసీలో విక్రయించి వాటితో వచ్చిన డబ్బులతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి జీవిస్తారు. అడవిలో లభించే పండ్లు, ఆకులు, వనరులను ఆహారంగా తీసుకుంటారు. సీజనల్ వారీగా లభించేవాటినే ఆహారంగా తీసుకొని కాలం గడుపుతారు. చెంచులు ఎక్కువగా బయ్యన్న, పోతురాజు, లింగమయ్య, నాగమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, భౌరమ్మ, మల్లమ్మ, లక్ష్మమ్మ, మైసమ్మ, గొవుల మైసమ్మ, గారెల మైసమ్మ, ఆంకాళమ్మ తదితర దేవతలను పూజిస్తారు. తమ అడవిలో ఉండే జంతువులనే దేవతలుగా భావిస్తారు. పెద్దపులిని పెద్దమ్మతల్లిగా, ఎలుగుబంటిని లింగమయ్యగా, అడవి పందిని మైసమ్మతల్లిగా, పాముని ఎల్లమ్మ, నాగమ్మగా, నల్లబోతు జంతువు– పోతురాజుగా, అడవి రేసు కుక్కలు–భౌరమ్మతల్లిగా ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. తేనె తీసే క్రమంలో తేనె తెట్టులో ఉండే తెల్లని తేనేగడ్డను మల్లమ్మ దేవతగా నమ్ముతారు. చెంచులు ప్రతి గుడిసె, కుటుంబంలో తప్పనిసరిగా శునకాన్ని పెంచుతారు. ఈ శునకాన్ని భౌరమ్మగా భావించడంతోపాటు చీపురుతో కొట్టడం, కాళ్లతో తన్నడం లాంటివి చేయరు. వేటకు వెళ్లేటప్పుడు శునకంతోపాటు భార్యాభర్తలు కలిసి వెళ్తారు. వేట సమయంలో సమీపంలో పులి, చిరుతపులి, ఎలుగుబంటి లాంటివి ఉంటే శునకం సూచన చేస్తుంది. దీంతో వేటకు వెళ్లిన చెంచులు ప్రమాదమని గ్రహించి అటువైపు వెళ్లకుండా ఇతర ప్రాంతానికి వెళ్తారు. వారి కట్టుబాట్లు ప్రత్యేకంగా ఉండడంతోపాటు ఇంటిపేర్లు ప్రత్యేకంగా ఉంటాయి. నల్లపోతులు, నిమ్మల, డంసాని, చిగుర్ల, మండ్లి, పిట్టల, చిర్ర, కనుమోని, తోకల, ఉడుతనూరి, కాట్రాజు, బల్మూరి, దాసరి, శీలం, పులిచెర్ల, బూమని, ఉడుతల, ఉడుతనూరి తదితర 30రకాల వరకు వీరి ఇంటి పేర్లు ఉంటాయి. వీరిలో నిమ్మల, నల్లపోతుల ఇంటివారు అందరినీ పెళ్లి చేసుకోవచ్చు. వీరి పిల్లలను మిగిలిన వాళ్లు పెళ్లి చేసుకోవచ్చు.

***హక్కుల సాధనకు పోరాడుతున్న ఆదివాసీలు..***

రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు కల్పించాలని నేటికీ ఆదివాసీలు ఉద్యమాలు చేస్తున్నారు. ఇటీవల మరోసారి అసెంబ్లీ వరకు పాదయాత్ర ప్రారంభించిన ఆదివాసీలు మన్ననూర్‌కు చేరుకోగానే పోలీసులు నిర్బంధించి అనుమతిలేదని నిలిపివేశారు. ఐటీడీఏ అధికారులు చర్చలు రెండునెలల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో పాదయాత్ర తాత్కాలికంగా నిలిపివేశారు. ఉపాధి హామీ పథకాన్ని ఐటీడీఏ ద్వారానే కల్పించాలి. జనరల్‌లో కలుపొద్దని చెంచులు కోరుతున్నారు. ప్రతి చెంచు నిరుపేద కుటుంబానికి అంత్యోదయ కార్డులు అందజేయాలి. పీసా చట్టం, అటవీహక్కుల చట్టం 2006 గురించి షెడ్యూల్ ఏరియాలో పని చేస్తున్న ప్రతిశాఖలోని అధికారులకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి. ప్రతిచెంచు గూడానికి రోడ్డు, కరెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలి. ఇల్లులేని కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలి. అటవీఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఈర్లపెంట, మేడిమెల్కల, సంగడిగుండాలు పెంటలను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి. గిరిజన కార్పొరేషన్‌లో నామినేటెడ్ పోస్టు చెంచులకు ఇవ్వాలి. టైగర్ ట్రాకర్స్‌ను రెగ్యులర్ చేయాలి. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి అటవీ అధికారుల వేధింపులు లేకుండా చూడాలి. భూమిలేని కుటుంబానికి భూమి ఇవ్వాలి. పీసా తీర్మానాలు గౌరవించి అమలు చేయాలి. మహిళా సంఘాలకు ట్రాక్టర్ ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.

# ఫర్టిలైజర్ దుకాణంపై దాడులు

- శ్యాంపిల్స్ ల్యాబ్‌కు తరలింపు..

ఉండవెల్లి, ఆగస్టు 8 : మండలంలోని బొంకూరు గ్రామంలో ఉన్న శ్రీ మణికంఠ ఫర్టిలైజర్ దుకాణంలో నాణ్యత లేని ఎరువులను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు డీఏవో గోవిందనాయక్ ఏడీఏ సక్రియానాయక్, ఏవో సురేఖతో కలిసి గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ రిజిస్టర్‌ను, పిచికారీ మందులు, ఎరువులను పరిశీలించారు. శ్రీ మణికంఠ దుకాణం నిర్వాహకుడు రవి (శివకృష్ణ గ్లోబల్ క్రాఫ్ సైన్స్‌స్ న్యూట్రిషన్ 50 కేజీల బస్తా) ఫర్టిలైజర్‌ను రూ.1200కు కల్తీ ఎరువును అమ్ముతున్నట్లు ప్రజల ఫిర్యాదు మేరకు శ్యాంపిల్స్ సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించారు. అదేవిధంగా ఈ ఘటనపై హైదరాబాద్ వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో

# నిండుకుండల్లా జూరాల, శ్రీశైలం



జూరాల గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ అయిజ/శ్రీశైలం, ఆగస్టు 8 : మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. గురువారం జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,15,000 క్యూసెక్కులు నమోదు కాగా 42 గేట్లు ఎత్తి దిగువకు 2,92,708 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.591 టీఎంసీలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 41,294, అవుట్‌ఫ్లో 30,141 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 103.861 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 63,579 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 62,900 క్యూసెక్కుల వరద నమోదు కాగా ఆయకట్టుకు 679 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 11.6 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది. శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో 3,54,761, అవుట్‌ఫ్లో 3,73,890 క్యూసెక్కులుగా నమోదైంది. పదిగేట్లు, విద్యుదుత్పత్తి నుంచి వరద దిగువకు పారుతున్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 202.0439 టీఎంసీలుగా ఉన్నది.

***ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..***

కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2,77,959 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 100.933 టీఎంసీలుగా నమోదైంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 2,00,490 క్యూసెక్కులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 27.330 టీఎంసీలుగా నమోదైంది.

# ప్రసాద్‌స్కీం పనులు వేగవంతం చేయాలి

- గద్వాల కలెక్టర్ సంతోష్

అలంపూర్, ఆగస్టు 8 : అలంపూర్ క్షేత్రంలో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈనెల 25వ తేదీలోగా దేవాదాయ శాఖకు అప్పగించాలని కలెక్టర్ బీఎన్ సంతోష్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయ పరిసరాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనం పనులను మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 300 మందికి సరిపడే అన్నదాన సత్రం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను త్వరలో పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్ తీసుకోవాలని లేదా బోర్ వేసి పనులు పూర్తి చేయాలన్నారు. దుకాణ సముదాయాన్ని పరిశీలించి టెండర్ పద్ధతిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ప్రాజెక్టు ముఖ్యఅధికారి అనంతరావు, కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండే, తాసీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ సరస్వతి, చైర్‌పర్సన్ మనోరమ, ఈవో పురేందర్‌కుమార్ ఉన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# ఏడేండ్ల చిన్నారిపై లైంగికదాడి



కొల్లాపూర్, ఆగస్టు 8 : ఓ కామాంధుడు ఏడేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలానికి చెందిన నర్సింహ కొంతకాలంగా కొల్లాపూర్ పట్టణంలో మేకల కాపరిగా పనిచేస్తున్నాడు. మనుమరాలి వయస్సు ఉన్న చిన్నారిపై ఈ కామాంధుడి కన్ను పడింది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏడేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని బాలిక తల్లితో చెప్పడంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేయగా డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో కేసు విచారణ చేపట్టినట్లు తెలుస్తున్నది.